క్లుప్తంగా

చికిత్సతో కుష్ఠు నివారణ



తిరువూరు: కుష్ఠు వ్యాధి నయం చేయడానికి అవసరమైన చికిత్స అందుబాటులో ఉన్నందున రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవ సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గుర్తింపునకు సర్వే జరుగుతోందని, ఎవరికైనా అనుమానాలుంటే ఆరోగ్య సిబ్బందికి తెలిపి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు కె. రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెంలోని అడహాక్ వీరాంజనేయ ఫిల్లింగ్ స్టేషన్‌ను తహసీల్దార్ జె. సుశీలాదేవి గురువారం తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ ఆయిల్‌లో కల్తీ ఉన్నదీ లేనిదీ, కొలతలను పరిశీలించారు. డెప్యూటీ తహసీల్దార్ బి. శివనాగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్‌ఓ జానీ సాహెబ్ పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో నూతనంగా ప్రతిష్ఠించనున్న అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను గురువారం పట్టణంలో ఊరేగించారు. రెండు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మైలవరంలో మరో 3 అదనపు జూనియర్ కోర్టులకు అనుమతి

మైలవరం: మైలవరంలో మరో మూడు అదనపు జూనియర్ కోర్టులకు అనుమతి మంజూరైందని మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏడీ ప్రసాద్, కార్యదర్శి వీటీ కిశోర్ తెలిపారని బార్ అసోసియేషన్ మీడియా కన్వీనర్ బుద్ధారపు వెంకట్రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మైలవరం జూనియర్ కోర్టు పరిధిలో సివిల్, క్రిమినల్‌కు సంబంధించి మూడు వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారు మైలవరం సివిల్ జడ్జి కోర్టుకు అదనంగా మరో మూడు జూనియర్ సివిల్ కోర్టులు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ వీఎస్ఎస్ శ్రీనివాస్‌శర్మ, షేక్ ఎం.ఫాజిల్ ఈ విధంగా 2025 జనవరి 16న జీఓ విడుదలైందని వివరించారు.

రథసప్తమి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఆగిరిపల్లి: కలియుగ ప్రత్యక్ష దైవం వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారి రథసప్తమి తిరునాళ్ల ఏర్పాట్లను డీఎస్పీ కేఎస్వీ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఫిబ్రవరి 4, 5, తేదీల్లో నిర్వహించే తిరునాళ్ల, రథోత్సవం కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ఎస్ఐ శుభశేఖర్‌కు సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏఎస్ఐలు శ్రీనివాసరావు, తవేరియా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

అక్కపాలెం(తిరువూరురూరల్): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ఎవరైనా యత్నిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తిరువూరు సీఐ గిరిబాబు హెచ్చరించారు. అక్కపాలెంలో గురువారం రోడ్డు భద్రత, శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. వేసవిలో నేరాలు జరిగే అవకాశం ఉన్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ కోడిపందేలు తదితర జూదాలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

7 నుంచి తిరు కల్యాణం

మైలవరం: ద్వారకా తిరుమల దత్తత దేవాలయం మైలవరంలోని వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర తిరు కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతుందని దేవదాయ శాఖ సంయుక్త కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు గురువారం తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

వాగునూ వదలరు!

ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా ఉంది ఆక్రమణదారుల వ్యవహారం. జి. కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు సరిహద్దుగా కట్టుబడిపాలెం వద్ద ఉన్న తొమ్మండ్రం వాగుపై వారి కన్ను పడింది. వాగును ఆక్రమించేందుకు భవనాల వ్యర్థాలను వాగులో నింపుతూ మెరక చేస్తున్నారు. ఇది ఆక్రమణలకు గురైతే భారీ వర్షాలు, వరదల సమయంలో వాగు దిశ మార్చుకుని గ్రామాలపై నీరు ప్రవహించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- అక్రమణ చెరలో తొమ్మండ్రం వాగు
- వాగును భవనాల శిథిలాలతో నింపుతున్న ఆక్రమణదారులు
- వరద వస్తే తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం
- పట్టించుకోని అధికారులు





శిథిలాలను వాగులో పోసి చదును చేయడంతో పిల్ల కాలువలా మారిన తొమ్మండ్రం వాగు (ఇన్‌సెట్) కట్టబడిపాలెం వద్ద తొమ్మండ్రం వాగులో గుట్టలుగా పోసిన భవనాల శిథిలాలు

జి.కొండూరు: గడ్డమణుగు లోయలోని కొండల్లో సహజ సిద్ధంగా పుట్టిన ఈ వాగు కట్టబడిపాలెం గ్రామం మీదుగా కవులూరు వరకు ప్రవహించి బుడమేరులో కలుస్తోంది. ఇటు కట్టుబడిపాలెం, అటు కొండపల్లి ఏడీఏకి సరిహద్దు ప్రాంతంలో ఒక వైపు వాగు, మరో వైపు ఏపీఐఐసీ కేటాయించిన స్థలం 11 ఎకరాలకు పైగా ఉంది. ఇప్పుడు అక్రమార్కులకు ఈ స్థలంపై కన్నుపడింది. పాత భవనాలను తొలగించగా వచ్చిన వ్యర్థాలను ఈ వాగులో నింపుతూ మెరక చేస్తూ అక్రమించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో 30వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని కొన్ని దుకాణాలను ఏర్పాటు చేయగా వాటికి వెనక భాగంలోనే ఈ శిథిలాలను నింపుతూ అక్రమార్కులు వాగును పూడ్చే పనిలో పడ్డారు. ఇదేవిధంగా ఆక్రమణలు కొనసాగితే తొమ్మండ్రం వాగు కనుమరుగైపోయి కొండల్లో నుంచి వచ్చే వరద ఉధృతి అటు కొండపల్లి ఐడీఏలోని పరిశ్రమలతో పాటు కట్టబడిపాలెం గ్రామం, కొండపల్లి శాంతి నగర్ వంటి గ్రామాలు పూర్తిగా నీట మునిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి తొమ్మండ్రం వాగు ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రసాయనిక వ్యర్థాలు సైతం వాగులోకే..

కొండపల్లి ఐడీఏలోని రసాయనిక పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను పరిశ్రమల యజమానులు పక్కనే ఉన్న తొమ్మండ్రం వాగులోకి వదులు తున్నట్లు గత కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. ఈ వివాదంపై గతంలో పలువురు రాజకీయ నాయకులు ధర్నాలు నిర్వహించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సైతం పలుమార్లు ఈ వాగును పరిశీలించారు కానీ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ వాగు కట్టుబడిపాలెం గ్రామం మీదుగా కవులూరు గ్రామ శివారులోని పంటపొలాల మీదుగా ప్రవహించి బుడమేరులో కలుస్తోంది. అయితే రసాయనిక వ్యర్థాలను వాగులోకి విడుదల చేయడం వల్ల ఈ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు, దోమలతో కట్టుబడిపాలెం గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ వాగులోని నీరు కవులూరు, కట్టబడిపాలెం గ్రామ శివారులోని వ్యవసాయ భూముల మీదుగా ప్రవహించడం వల్ల ఆ భూములు సాగుకు పనికిరాకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

రాజకీయాలకు కేంద్ర బిందువుగా..

తొమ్మండ్రం వాగు రాజకీయ నాయకులకు తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు నిత్యం ఒక పావులా ఉపయోగపడుతూ ఉంటుంది. ఎన్నికల ముందు సమస్యను పరిష్కరిస్తామని హామీలు గుప్పించే నాయకులు, ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యను గాలికొదిలేయడం పరిపాటిగా మారింది. ఇక ఇప్పుడు వాగునే ఆక్రమించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరగడం స్థానికులను మరింత కలవర పెడుతోంది. ఒక వైపు రసాయనిక వ్యర్థాలతోనే నరకయాతన పడుతుంటే ఇప్పుడు వాగునే ఆక్రమించేస్తే భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వరద ప్రవాహం దిశ మార్చుకొని గ్రామాల మీద పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు సహించం



తొమ్మండ్రం వాగులో అక్రమణలు జరుగుతున్నట్లు తెలితే చర్యలు చేపడతాం. వాగును శిథిలాలతో నింపితే సహించేదిలేదు. వాగును ప్రత్యక్షంగా పరిశీలించి అక్రమణ చేస్తున్నట్లు నిర్ధారణ అయితే సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– జి.వెంకటేష్, బుడమేరు ఏఈ, జి.కొండూరు

వైస్ చైర్మన్ ఎన్నికకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హాజరు కావాలి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి 32వ వార్డు కౌన్సిలర్ నవుదు నాగమల్లేశ్వరరావును ఎన్నుకుంటామని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రతాప్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం పగడాల సత్యనారాయణ రాజీనామా అనంతరం నవుదు నాగమల్లేశ్వరరావును వైస్ చైర్మన్‌గా చేసుకోవాల్సి ఉందని, అయితే ఎన్నికల కోడ్ రావడం, ఆ తరువాత ప్రభుత్వం మారడం, ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో జాప్యం చేయడం వల్ల ఆలస్యమైందన్నారు. నవుదు నాగమల్లేశ్వరరావుకు పార్టీ బీఫాం ఇవ్వడంతో పాటు విప్ కూడా జారీ చేస్తుందని చెప్పారు. మూడో తేదీన ఉదయం 10.30 గంటలకు 24 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు నేర్పరి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారం చేపట్టిన తరువాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు నేర్పరి అని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. నూజివీడులో గురువారం ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబు ఏనాడూ సంపద సృష్టించలేదని, అసలు దానిని ఎలా సృష్టించాలో కూడా ఆయనకు తెలియదని ఎద్దేవా చేశారు. 2019లో దిగిపోయే రోజున రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉంచారన్నారు. సంపద సృష్టించే వ్యక్తి అయితే గతంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి అప్పుల మీద అప్పులు చేశారే గాని అప్పులు లేకుండా పాలన చేశారా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేక కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏటా రూ.20 వేలు, నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఏమయ్యాయని నిలదీశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో రూ.73,635 కోట్లు అప్పులు చేశారని, అన్ని రకాల అప్పులు కలిపి రూ.1.19 లక్షల కోట్లు చేశారన్నారు. అప్పులు చేసి తెచ్చిన డబ్బులను ఏం చేశారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని కోరారు. మూడు పెద్ద పోర్టులు, హార్బర్లను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తుంటే వాటిని కూడా అమ్మేయాలని చూడటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేవలం రూ.100 కోట్లతో రాష్ట్ర ఖజానాను అప్పగించినప్పటికీ, కరోనా వంటి విపత్కర పరిస్థితి ఎదురైనప్పటికీ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో ఏనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించలేదన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే పారదర్శకంగా జరపాలి

ఎంపీడీఓ సునీత శర్మ

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ సునీతశర్మ పేర్కొన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంఎస్ఈఎంఈ సర్వేపై అవగాహన సదస్సు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద చిరు వ్యాపారుల పూర్తి సమాచారం ఉండటం వల్ల సకాలంలో అర్హతను బట్టి రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. సమావేశంలో సర్వే అధికారి రవికుమార్, పలు గ్రామాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొందుగల గ్రామానికి కీర్తి తెచ్చిన సర్పంచ్ కోటమ్మ

మైలవరం: పొందుగల గ్రామ పంచాయతీకి దేశ స్థాయిలో కీర్తి తీసుకు వచ్చిన సామాన్యురాలు సర్పంచ్ గుగులోతు కోటమ్మ అని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్యనాయుడు అన్నారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ కోటమ్మ అభినందన సభ పొందుగల గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అక్కయ్యనాయుడు మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచినప్పుడు కోటమ్మ ఒక సామాన్య గృహిణి అని, పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నేడు జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. అందుకు సర్పంచ్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. గ్రామాభివృద్ధిలో తాను భాగమైనందుకు తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గ్రామ ప్రముఖులు బొందలపాటి సుధాకరరావు మాట్లాడారు. గ్రామ ప్రముఖులు సర్పంచ్ కోటమ్మను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. బాణోతు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సర్పంచ్ కోటమ్మను సన్మానిస్తున్న అక్కయ్యనాయుడు

గీత కార్మికుల మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: నియోజకవర్గంలో గీత కార్మికులకు కేటాయించిన నాలుగు మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎ.మస్తానయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు మున్సిపాలిటీలో గౌడ కులానికి, చాట్రాయి, ఆగిరిపల్లి, ముసునూరుల్లో శెట్టి బలిజ కులానికి మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ షాపులకు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి ఈ నెల 7న జిల్లా కలెక్టర్ ఏలూరులో డ్రా తీస్తారని చెప్పారు.

తామర పురుగు నివారణకు చర్యలు

చాట్రాయి: మామిడిలో తామర పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి హేమ అన్నారు. చాట్రాయి, చనుబండ, చిత్తపూరు, నరసింహారావుపాలెం, కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో మామిడి పూతలపై పరిశీలన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికి తామర పురుగు ఆశించిందని, దీని నివారణకు 0.25 మిల్లీ గ్రాముల స్పైనోసోడ్‌ని లేదా 0.5 గ్రాముల థయోమిథాక్స్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

48 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లి పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది గురువారం నిర్వహించిన దాడుల్లో జన బాబీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి తెలంగాణకు చెందిన 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లఫారంపై ఫిర్యాదు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): లక్ష్మీపురంలోని కోళ్లఫారంలో వ్యాధి సోకి మరణించిన కోళ్లను కాలుస్తుండటంతో తాము ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు గురువారం తిరువూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కోళ్లను కాల్చి వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని, తాము అనారోగ్యం బారిన పడుతున్నామని లక్ష్మీపురం గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వాటిని వెంటనే పూడ్చాలని కోళ్లఫారం నిర్వాహకులను ఆదేశించారు.

మహాత్ముని జీవితం ఆదర్శం



నూజివీడులో నివాళులర్పిస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు



చంద్రుపట్ల ఎంపీపీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నూజివీడు: దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్ముని బాటలోనే ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి ప్రతాప్ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గం, ఆదర్శాలు, సత్య నిష్ఠ మనందరికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు షేక్ యూనస్ పాషా, పగడాల సత్యనారాయణ, బసవా వినయ్, చేబత్తిన మున్నా, గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహాత్ముని బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి ఘన నివాళి

మైలవరం: సమాజంలో సంఘర్షణలన్నీ అహింస మార్గంలో పరిష్కరించుకోవచ్చని మహాత్మా గాంధీ చెప్పారని వైఎస్సార్ సీపీ మైలవరం పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం గురువారం పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ మహాత్ముని బాటలో పయనించాలని కోరారు. మహాత్ముని జీవితం ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **తిరువూరు:** తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. గంపలగూడెం మండలం పెనుగొలను సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, గ్రంథాలయాధికారి శ్రీలత, షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యుడు నారాయణరావు తదితరులు పూలమాలలు వేశారు. ఊటుకూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బాపూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విస్సన్నపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలో, చంద్రుపట్ల ఎంపీయూపీ స్కూల్‌లో గాంధీజీ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.
- **ఆగిరిపల్లి:** స్థానిక ఆర్య వైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు మడుపల్లి గోపాల్, మండల అధ్యక్షుడు చలవాది వెంకటరత్నం, యండూరి ప్రణీత్, టీవీఎస్ కిరణ్, జూలూరు కోటేశ్వరరావు, యండూరు నరసింహమూర్తి పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందాలి

తిరువూరు: అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలు పెంపొందించుకుంటే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించగలరని విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అధ్యాపకురాలు మరియా ప్రియదర్శిని అన్నారు. తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వీఎల్ఎస్ఐ డిజైనింగ్‌పై అధ్యాపకులు, విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. మారుతున్న సాంకేతిక పరిస్థితుల కనుగుణంగా, పోటీతత్వాన్ని గుర్తించి విద్యార్థిని సమున్నతంగా అభివృద్ధి చేయగలిగే బోధన రావాలని ఆమె సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, చైర్మన్ వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చేపల మృతికి రసాయనాలు కారణం కాదు

విస్సన్నపేట: స్థానిక కోనేరు చెరువులో చేపల మృతికి రసాయనాలు కారణం కాదని విస్సన్నపేట ఎంపీడీఓ చిన రాట్నాలు అన్నారు. గురువారం ఆయన విస్సన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న కోనేరు చెరువులో చేపల మృతిపై పాటదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతి చెందిన చేపలను విజయవాడ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపామని తెలిపారు. చేపల మృతికి రసాయనాలు కారణం కాదని నివేదిక వచ్చిందన్నారు. సర్పంచి నాగమల్లేశ్వరి, ఈఓ హరికృష్ణ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



తిరువూరు బోస్ సెంటర్‌లో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మైలవరం: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రాణాలు కాపాడుకోవాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. హెల్మెట్ ధారణపై వాహన చోదకులకు గురువారం అవగాహన కల్పించారు. సురక్షా కార్యక్రమంలో భాగంగా స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచి స్థానిక పంచాయతీ కార్యాలయం వరకు వాహన చోదకులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, కళాశాల విద్యార్థులు, వాహన చోదకులు పాల్గొన్నారు.

- **తిరువూరు:** ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ విధిగా ధరించాలని తిరువూరు సీఐ గిరిబాబు అన్నారు. స్థానిక బోస్ సెంటర్‌లో హెల్మెట్ ఆవశ్యకత తెలుపుతూ పోలీసులు ద్విచక్ర వాహన దారులకు గురువారం పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. హెల్మెట్ ధరించని చోదకులపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ చివరి తేదీ ఫిబ్రవరి 10

మైలవరం: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి ఈ నెల 29న విడుదల చేశారని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై. వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, నామినేషన్ దాఖలు చేయడానికి చివరి తేదీ ఫిబ్రవరి 10, నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11, విత్ డ్రాకు ఫిబ్రవరి 13 వరకు గడువుందన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ బుధవారం నుంచి అమలులోకి వచ్చిందన్నారు.

జూదరుల అరెస్ట్

తిరువూరు: ఎ.కొండూరు మండలం చీమలపాడులో గురువారం కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి నిర్వహించారు. 20 మంది జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.24 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపుంజులు, కోళ్ల కాళ్లకు కట్టే కత్తులను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

హోటళ్లకు గోమాంసం సరఫరాపై ఆందోళన

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు హోటళ్లలో గోమాంసం సరఫరా చేస్తున్నారని బీజేపీ నాయకులు అన్నవరపు సత్యనారాయణ ఆర్‌డీఓ మాధురికి గురువారం ఫిర్యాదు చేశారు. బైపాస్‌రోడ్డులో ఆవులను వధించి హోటళ్లలో బిర్యానీ పేరుతో విక్రయిస్తున్నారని, విస్సన్నపేట వీరబ్రహ్మేంద్రస్వామి గుడి సమీపంలో కూడా గోవధ జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: మండలంలోని మర్లపాలెంలో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభు తెలిపారు. కుప్పాల రామచంద్రయ్య, సారా పంపిణీ చేస్తున్న వడిత్యా భిక్షాలుపై కేసు నమోదు చేశామని చెప్పారు.